# పంజాబ్ రాష్ట్రం మరియు మరొకరు.

వర్సెస్

ధరమ్ పాల్ మరియు ఇతరులు

జనవరి 22, 1996

[K.రామస్వామి మరియు G.B.పట్టనాయిక్, న్యాయమూర్తులు]

సేవా చట్టము:

వేతనాన్ని పెంచడం – పంజాబ్ రాష్ట్రంలోని పారిశ్రామిక శిక్షణా సంస్థలు/కేంద్రాలు – బోధకులు – వేతన శ్రేణి (పే స్కేలు) – అంతకుముందు బోధకులందరికి ఒకే వేతన శ్రేణి లభించేది – తరువాత 8 వృత్తుల (ట్రేడ్ల) యొక్క బోధకులకు వేర్వేరు వేతన శ్రేణి ఇవ్వబడింది – తదనంతరం బోధకులందరికి ఒకే వేతన శ్రేణి ఇవ్వబడింది, కానీ 8 వృత్తుల యొక్క బోధకులు తమకు వ్యక్తిగతంగా ఉన్న అధిక వేతన శ్రేణిని నిలుపుకోవటానికి అనుమతించబడ్డారు – సవరించిన వేతన శ్రేణిలో జీతం నిర్ణయించడం – సవరించడానికి ముందు అధిక వేతన శ్రేణి పొందుతున్న బోధకుల జీతం వారి ముందస్తు సవరించిన జీతం ప్రకారం నిర్ణయించబడింది – తమ జూనియర్ల జీతాలు ఉన్నత స్థాయిలో నిర్ణయించారని ఆరోపిస్తూ ఇతర బోధకులు తమ వేతనాన్ని పెంచాలని కోరారు – నిర్వహించదగినది కాదని అభిప్రాయము.

పారిశ్రామిక శిక్షణా సంస్థలు/ కేంద్రాల బోధకుల వేతనాన్ని పెంచడానికి అనుమతించిన హైకోర్టు ఆదేశాలకి వ్యతిరేకంగా పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత అప్పీలును దాఖలు చేసింది. 1961 కి ముందు రాష్ట్రంలోని పారిశ్రామిక శిక్షణా సంస్థలు/కేంద్రాల బోధకులందరికీ ఒకే వేతన శ్రేణి లభించేది. ఆ తరువాత 8 వృత్తులకు(ట్రేడ్లకు) చెందిన బోధకుల వేతన ప్రమాణాలు మార్చబడ్డాయి. ఆ 8 వృత్తుల(ట్రేడ్ల) పరిధిలోకి రాని బోధకులు, హైకోర్టు ముందు పేర్కొన్న వర్గీకరణను సవాలు చేయడంలో విఫలమయ్యారు. 1970లో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వృత్తుల (ట్రేడ్ల) లో బోధకుల సిబ్బంది విధానాన్ని సవరించి, వారందరినీ ఒకే వేతన శ్రేణిలో ఉంచింది. అయిననూ, 8 వృత్తులకు చెందిన 181 మంది బోధకులు వారి వ్యక్తిగత వేతన శ్రేణి పొందుటకు అనుమతించబడింది. 1976 సంవత్సరంలో బోధకులందరికీ సంబంధించి వేతన శ్రేణిని మరింత సవరించారు మరియు వ్యక్తిగత బోధకుడి వేతనం అతను ముందు సవరించిన స్థాయిలో పొందుతున్న వేతనాన్ని బట్టి సవరించిన శ్రేణిలో నిర్ణయించబడింది.

1989లో ప్రతివాదులు, అధిక వేతనం పొందుతున్న 8 గ్రేడ్లలోని 181 మంది భోదకులు తమకంటే జూనియర్లు అని పేర్కొంటూ తమయొక్క వేతనాన్ని పెంచేలా ఆదేశాలివ్వాలని కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. గత రిట్ పిటిషన్ లో ప్రతివాదులు విఫలమయ్యారని, వేతన శ్రేణి విభజన పూర్తి అయ్యినదని, అధిక జీతం పొందుతున్న 8 ట్రేడ్ల బోధకులు వారి వ్యక్తిగత వేతన శ్రేణిని తీసుకొనుటకు అనుమతించబడ్డారని, అందువల్ల వేతన శ్రేణిని మరింత సవరించినప్పుడు, వ్యక్తిగత బోధకుల జీతం సవరణకు ముందు వారు పొందుతున్న జీతం ప్రకారం సరిగ్గా నిర్ణయించబడిందని రాష్ట్రం వాదిస్తూ వారి క్లెయిమ్ ను ప్రతిఘటించింది. హైకోర్టు యొక్క సింగిల్ జడ్జి రిట్ పిటిషన్ను అనుమతించారు మరియు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన లెటర్స్ పేటెంట్ అప్పీలును డివిజన్ బెంచ్ మొదట్లోనే కొట్టివేసింది.

అప్పీలును అనుమతిస్తూ, ఈ కోర్టు

నిర్ణయం: జూనియర్లు ఎక్కువ మొత్తాన్ని పొందుతున్నారని భావించి ప్రతివాదుల వేతనాన్ని పెంచాలని ఆదేశించడం ద్వారా హైకోర్టు పొరపాటు చేసింది. 1976లో సవరించిన కొత్త వేతన శ్రేణిలో వేతనాన్ని నిర్ణయించేటప్పుడు, తప్పనిసరిగా 8 వృత్తులకు (ట్రేడ్లకు) చెందిన 181 మంది బోధకులు గతంలో తీసుకున్న అధిక వేతనాన్ని పరిగణనలోకి తీసుకున్నారు మరియు వారికి అధిక మొత్తం లభించింది. ఈ పరిస్థితుల్లో ప్రతివాదుల వేతనాలను పెంచే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఆ 181 మంది బోధకులు మొదట ఈ ప్రతివాదుల కంటే జూనియర్ అయి ఉండవచ్చు, కానీ 1962 ఫిబ్రవరి 23 నాటి ప్రభుత్వ ఉత్తర్వు కారణంగా వారికి ప్రతివాదుల కంటే ఎక్కువ వేతనం ఇవ్వబడింది మరియు అదే ప్రయోజనం వారికి వ్యక్తిగత వేతనంగా కొనసాగించబడింది, వేతన స్థాయి యొక్క తదుపరి సవరణలో మరియు మునుపటి రిట్ పిటిషన్లలో సవాలు చేసి ఓడిపోయిన ప్రతివాదుల మాదిరిగానే ఉంచబడిన వ్యక్తులు ఈ విషయాన్ని తిరిగి లేవనెత్తడానికి వారికి అవకాశం లేదు. [829-G, 830-B-C]

సివిల్ అప్పీల్లెట్ అధికార పరిధి: సివిల్ అప్పీల్ నెంబర్లు:2206-2209/1996.

L.P.A.నెం.439/94, C.W.P. నెం.13546, 5346/1994 యందు పంజాబ్ మరియు హర్యానా హైకోర్టు 19.7.94 మరియు 1.11.94 తేదీలలో ఇచ్చిన తీర్పు మరియు ఉత్తర్వు నుండి.

సంజయ్ బన్సాల్ మరియు G.K.బన్సాల్, అప్పీలుదారుల తరపున.

P.P.రావు, R.K.చోప్రా మరియు P.N.పూరి, ప్రతివాదుల తరపున.

న్యాయస్థానం యొక్క తీర్పు వెలువరించినవారు

**పట్టనాయిక్, న్యాయమూర్తి**. అనుమతి మంజూరు చేయబడింది.

లెటర్స్ పేటెంట్ అప్పీలును ప్రారంభంలోనే కొట్టివేసి, గౌరవ సింగిల్ జడ్జి ఉత్తర్వులను ధ్రువీకరిస్తూ పంజాబ్ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా పంజాబ్ రాష్ట్రం ఈ అప్పీళ్లను దాఖలు చేసింది. ప్రతివాదులు వారు భోదిస్తున్న వృత్తితో సంబంధం లేకుండా వారి వేతనాన్ని పెంచడానికి మరియు ఇతర బోధకులు తీసుకునే వేతనానికి సమానంగా ఉపశమనాన్ని పొందడానికి అర్హులా అనేది పరిశీలనలోకి తీసుకోవలసిన అంశము. తమకు ఒకే అర్హత ఉన్నదని మరియు తాము బోధకులుగా నియమితులై అలానే కొనసాగుతున్నామని, అయితే 4.1.1961 నుంచి 8 వృత్తులకు సంబంధించి బోధకుల వేతన శ్రేణులను మార్చారని, ప్రతివాదుల వేతన శ్రేణులను మార్చలేదని ఆరోపిస్తూ ప్రతివాదులు పంజాబ్, హర్యానా హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. తరువాతి వేతన సవరణలో ఎటువంటి వ్యత్యాసం లేనప్పటికీ, తమ వృత్తుల (ట్రేడ్) ఆధారంగా అధిక స్థాయిలో వేతనం పొందుతున్న వ్యక్తుల సమూహం ప్రతివాదులకు జూనియర్ అయినప్పటికీ వారు అదే అధిక వేతనాన్ని పొందుతూనే ఉన్నారు, అందువల్ల, ప్రతివాదులు తమ వేతనాన్ని పెంచడం ద్వారా వేతనాన్ని పొందడానికి అర్హులు. మరోవైపు, రాష్ట్ర వైఖరి ఏమిటంటే, 1961 కి ముందు గ్రేడ్ II లోని బోధకులందరూ వారి వృత్తితో సంబంధం లేకుండా ఒకే స్థాయి వేతనాన్ని పొందుతున్నారనడంలో సందేహం లేదు, అయితే తరువాత 8 వృత్తుల(ట్రేడ్ల) బోధకులకు సంబంధించి వేతన ప్రమాణాలు మార్చబడ్డాయి మరియు ప్రతివాదులు ఆ 8 వృత్తుల(ట్రేడ్ల) పరిధిలోకి రాలేదు. ప్రతివాదుల మాదిరిగానే ఉన్న కొంతమంది ఉద్యోగులు రిట్ పిటిషన్ను దాఖలు చేయడం ద్వారా చెప్పిన వర్గీకరణను సవాలు చేశారు, అది చివరికి కొట్టివేయబడింది మరియు దానికి వ్యతిరేకంగా ఉన్న లెటర్స్ పేటెంట్ అప్పీలు కూడా కొట్టివేయబడింది మరియు ఆ విషయం అంతిమమైనది. 1970 లో రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణా సంస్థలు/కేంద్రాల బోధకుల సిబ్బంది నమూనాను సవరించి, బోధకులందరిని రూ.160-400 వేతన శ్రేణిలో ఉంచింది. అలా చేస్తూనే 181 మంది అధిక వేతనం పొందుతున్న బోధకులకు సంబంధించి వారి వ్యక్తిగతంగా ఉన్న మునుపటి వేతన స్కేలును వారు తీసుకొనుటకు అనుమతించారు మరియు బోధకులందరినీ జూనియర్ లేదా సీనియర్ కాకుండా బోధకులుగా నియమించారు. 1976 సంవత్సరంలో వేతన శ్రేణిలను రూ.225-500 కు సవరించి, వ్యక్తిగత బోధకుడి వేతనాన్ని ముందుగా ఉన్న వేతన శ్రేణిలో అతను తీసుకుంటున్న

వేతనాన్ని బట్టి వేతన శ్రేణిని నిర్ణయించారు. 1989 సంవత్సరంలో మాత్రమే ప్రతివాదులు తమ జూనియర్లు అధిక మొత్తాన్ని పొందుతున్నారనే ఆరోపణపై తమ పెంపునకై ఉపశమనం కోరుతూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వారి వృత్తి(ట్రేడ్) ఆధారంగా వేర్వేరు శ్రేణులలో వేతనాన్ని అందించే వర్గీకరణ యొక్క ఖచ్చితత్వాన్ని తప్పు పట్టడంలో ప్రతివాదులు విఫలమైన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ప్రకారం, రిట్ పిటిషన్ తో పాటు దానికి వ్యతిరేకంగా లెటర్స్ పేటెంట్ అప్పీలును కొట్టివేసినప్పటికీ, ఈ విషయాన్ని తిరిగి లేవంతడానికి వారికి అవకాశం లేదు. తదుపరి వైఖరి ఏమిటంటే, భోదకులందరికీ సవరణ ద్వారా ఒకే వేతన శ్రేణిని నిర్ణయించినప్పటికీ, మునుపటి ఆదేశానికి అనుగుణంగా అధిక శ్రేణి వేతనాన్ని పొందుతున్న వారు వ్యక్తిగతంగా పేర్కొన్న అధిక శ్రేణి వేతనంలో కొనసాగడానికి అనుమతించబడ్డారు మరియు తప్పనిసరిగా వారి వేతనాన్ని సవరించిన శ్రేణిలో నిర్ణయించేటప్పుడు, సవరించుటకు ముందు పొందుతున్న మొత్తాన్ని పరిగణనలోకి తీసుకోవాలి, తద్వారా ప్రతివాదుల వేతనాన్ని పెంచే ప్రశ్న తలెత్తదు. అందువల్ల ప్రతివాదుల వేతనాన్ని పెంచే విషయము తలెత్తదు. లెటర్స్ పేటెంట్ అప్పీలు యందు తీర్పును సమర్థిస్తూ రిట్ పిటిషన్ నంబర్ 10506/1989 ను సింగిల్ జడ్జి అనుమతించారు, దీనిద్వారా స్పెషల్ లీవ్ పిటిషన్ నంబర్ 4855/1995 ఏర్పడినది. ఇతర రెండు కేసులలో ఈ కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును మాత్రమే అనుసరించారు.

ఫిబ్రవరి 23, 1962 తేదీనందు ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం 8 వృత్తులకు సంబంధించి అధిక శ్రేణి, మిగిలినవాటికి సంబంధించి తక్కువ శ్రేణి ఇచ్చే బోధకుల మధ్య విభజన అంతిమమైందని, 1970లో బోధకులందరికీ ఒకే శ్రేణి వేతనాన్ని నిర్ణయించినప్పటికీ, అధిక శ్రేణి వేతనాన్ని పొందుతున్న 8 వృత్తుల బోధకులు తమకు వ్యక్తిగతంగా లభించే వేతనాన్ని పొందడానికి అనుమతించబడ్డారు, అందువల్ల, ప్రతివాదుల వేతనాన్ని పెంచమని అప్పీలుదారుని ఆదేశించడంలో హైకోర్టు పొరపాటు చేసిందని అప్పీలుదారు తరపున గౌరవ న్యాయవాది వాదించారు. మరోవైపు ప్రతివాదుల తరపున గౌరవ న్యాయవాది శ్రీ రావు వాదిస్తూ, భోదకులందరి విద్యా అర్హత ఒకటే అని, వారు ఒకే ప్రక్రియ ద్వారా నియమించబడ్డారని కాగా భోదకులను జూనియర్, సీనియర్లుగా విభజించి పేరు పెట్టుట తప్పు తప్ప మరొకటి కాదని వాదించారు. వారి అభ్యర్ధన మేరకు ప్రభుత్వం చివరికి వ్యత్యాసాన్ని రద్దు చేసి, 1976 సంవత్సరంలో వాటన్నింటినీ ఒకే స్థాయిలో తీసుకువచ్చినందున, ప్రతివాదుల కంటే జూనియర్ ఉద్యోగుల వేతనాన్ని అధిక స్థాయిలో నిర్ణయించడం సమంజసం కాదని, అందువల్ల, వేతనాన్ని పెంచాలని గౌరవ హైకోర్టు సరిగ్గా ఆదేశించినదని పేర్కొన్నారు.

ఇరుపక్షాల తరపు న్యాయవాదుల వాదనలు విన్న తర్వాత, రికార్డుల్లో ఉన్న అంశాలను పరిశీలించిన తర్వాత జూనియర్లు ఎక్కువ మొత్తం పొందుతున్నారనే భావనతో ప్రతివాదుల వేతనాలను పెంచాలని ఆదేశించడం ద్వారా హైకోర్టు తప్పు చేసిందని మేము భావిస్తున్నాము. 1961 కి ముందు బోధకులు మొదట 80-200 అనే వేతన స్థాయిలో పొందుతున్నారనేది వివాదాస్పదంగా లేదు, అయితే 1962 ఫిబ్రవరి 23న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 8 శ్రేణులలో బోధకులకు సంబంధించి రూ.80-200 ఉన్న వేతన స్కేలును రూ.160-330కి సవరించారు. 8 వృత్తుల బోధకులకు సంబంధించి పైన పేర్కొన్న వేతన సవరణను ఇతర వృత్తులకు (ట్రేడ్) చెందిన మిగిలిన బోధకులు సవాలు చేయడంలో విఫలమయ్యారు మరియు రిట్ పిటిషన్ (సివిల్) నెం.3038/69 తో పాటు వ్యతిరేకంగా ఉన్న లెటర్స్ పేటెంట్ అప్పీల్ నెం.654/1970 అనునది జనవరి 24, 1972 తేదీనందు ఇచ్చిన తీర్పు ద్వారా కొట్టివేయబడినది. రాష్ట్ర ప్రభుత్వం 1970 సెప్టెంబరులో భోదకులందరినీ ఒకే వేతన శ్రేణిలో రూ.160-400 లో ఉంచగా, అయితే 1962 ఫిబ్రవరి 23 నాటి ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా అధిక వేతనం పొందిన 181 మంది బోధకులు తమ వ్యక్తిగత వేతన శ్రేణిని తెసుకొనుటకు అనుమతించబడ్డారు. ఇది ఆమోదించబడిన స్థాయి కావడంతో, 1976లో వేతన శ్రేణిని రూ.225-500 గా అందరి బోధకులకు సవరించదమైనది, కానీ సవరించిన స్థాయిలో వేతనాన్ని తప్పనిసరిగా నిర్ణయించేటప్పుడు, 8 వృత్తులకు చెందిన ఆ 181 మంది బోధకులు తీసుకున్న అధిక వేతనాన్ని పరిగణనలోకి తీసుకున్నందున వారికి అధిక మొత్తం లభించింది. ఈ పరిస్థితులలో ప్రతివాదుల వేతనాన్ని పెంచే ప్రశ్న తలెత్తదు. ఆ 181 మంది బోధకులు మొదట ఈ ప్రతివాదులకు జూనియర్ అయి ఉండవచ్చు, కానీ 1962 ఫిబ్రవరి 23 నాటి ప్రభుత్వ ఉత్తర్వు కారణంగా వారికి ప్రతివాదుల కంటే అధిక స్థాయి వేతనం ఇవ్వబడింది మరియు అదే ప్రయోజనం తదనంతర వేతన సవరణలో వారికి వ్యక్తిగత వేతనంగా కొనసాగించబడింది మరియు మునుపటి రిట్ పిటిషన్లలో సవాలు చేసి ఓడిపోయిన ప్రతివాదుల వలె ఉంచబడిన వ్యక్తులు ఈ విషయాన్ని తిరిగి తెరుచుటకు వారికి అవకాశం లేదు. ఈ విషయం దృష్ట్యా, బోధకుల పోస్టుకు అర్హత ఒకే విధంగా ఉండటం మరియు వారు ఒకే సేవా షరతుల ద్వారా నిర్ణయించబడటం వలన జూనియర్ వ్యక్తి ఎక్కువ మొత్తాన్ని పొందలేరనే ప్రాతిపదికన సంబంధిత వాస్తవాలను వెల్లడించకుండా సింగిల్ జడ్జి పెంపుదలను  ఉపశమనంగా కలిగించారని నిర్ధారణకు రావడానికి మాకు ఎటువంటి సంకోచం లేదు. లెటర్స్ పేటెంట్ అప్పీలును మొదట్లోనే కొట్టివేయడంలో డివిజన్ బెంచ్ పొరపాటు చేసింది. తదనుగుణంగా మేము సింగిల్ జడ్జి తీర్పులను అలాగే డివిజన్ బెంచ్ తీర్పును పక్కనపెడుతూ, ఈ

అప్పీళ్లను అనుమతిస్తున్నాము, తత్ఫలితంగా ప్రతివాదులు దాఖలు రిట్ పిటిషన్లు కొట్టివేయబడినాయి. కానీ ప్రస్తుత పరిస్థితులలో, ఖర్చులకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వు ఇవ్వబడలేదు.

అప్పీళ్లు అనుమతించబడ్డాయి.

అనువదించినవారు ARK.

అనువదించిన పేజీల సంఖ్య – 5.